క్లుప్తంగా

రూ.70 లక్షలతో నూతన రక్షణ సైన్యం చర్చి నిర్మాణం



రక్షణ సైన్యం చర్చిలో మాట్లాడుతున్న మేజర్ కె.రమణయ్య, కల్నల్ డి. జోషియా

దెందులూరు: దెందులూరులో 35 ఏళ్ల చరిత్ర గల రక్షణ సైన్యం చర్చి శిథిలావస్థకు చేరిందని రూ.70 లక్షల అంచనా వ్యయంతో నూతన ప్రార్థనా మందిరాన్ని నిర్మిస్తున్నామని దెందులూరు రక్షణ సైన్యం కోర్ ఆఫీసర్ మేజర్ కే.రమణయ్య అన్నారు. ఆదివారం దెందులూరులో నూతన దేవాలయ నిర్మాణ కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు.1986లో ఈ చర్చి నిర్మించారని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం నూతన చర్చి నిర్మాణ ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. లెఫ్టినెంట్ కల్నల్ డీ.జోషియా పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



గణపవరంలో మానవత చలివేంద్రంలో మజ్జిగ పోస్తున్న సభ్యులు

గణపవరం: మానవత సంస్థ ద్వారా సభ్యులు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల అవసరాలను తీర్చడం అభినందనీయమని మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు అన్నారు. ఆదివారం గణపవరంలో మానవత ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి కె.వినాయకం ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

ఉంగుటూరు: ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. ఏప్రిల్‌లో మానవత ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాకార్యక్రమాలపై చర్చించారు. సమావేశానికి మండల మానవత అధ్యక్షుడు గంజి రవి అధ్యక్షత వహించారు. సమావేశంలో మండల కన్వీనర్ అడపాశ్రీనివాసరావు, పూర్వపు అధ్యక్షులు నరసింహరాజు, మండల చైర్మన్ గుణ్ణం బుల్లబ్బాయి, బొమ్మిడి అప్పారావు పాల్గొన్నారు.

వెంకాయమ్మకు ఘన నివాళి



వెంకాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కొఠారు రామచంద్రరావు

పెదవేగి : మంచి మనసున్న వ్యక్తి వెంకాయమ్మ లేని లోటు తీరనిదని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు అన్నారు. ఆదివారం పెదవేగి మండలం న్యాయంపల్లిలో వెల్లంకి ప్రసాద్ తల్లి వెంకాయమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కొఠారు రామచంద్రరావు పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు: విద్యుత్ మరమ్మతుల కారణంగా పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ రాళ్లపల్లివారి పాలెం ఫీడర్‌లో సోమవారం నూతన లైన్లు నిర్మాణం, లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. రాళ్లపల్లివారి పాలెం ఫీడర్ పరిధిలోని ఖాజీగూడెం, గుడిపాడు, సత్యవోలు రాళ్లపల్లివారి పాలెం తదితర ప్రాంతాల్లో ఈనెల 29,30, మే1 తేదీల్లో ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

నేడు నామినేషన్ల ఉపసంహరణ

ఉంగుటూరు: నామినేషన్లు ఉపసంహరణకు సోమవారంతో గడవు ముగియనున్నట్టు ఆర్వో ఖాజావలి తెలిపారు. ప్రస్తుతం నామినేషన్లు 16 మంది దాఖలు చేశారని, ఒక నామినేషన్‌ను పరిశీలనలో తొలగించామన్నారు. 15 నామినేషన్లు మిగిలాయని తెలిపారు. వాటిలో నామినేషన్లు ఉపసంహరణకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలతో ముగియనుందని తెలిపారు.

దెందులూరులో ప్రగతి పరుగు



దెందులూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్



దెందులూరులో నూతనంగా నిర్మించిన ప్రధాన రహదారి

- సంక్షేమాభివృద్ధికి రూ.50 కోట్ల నిధుల ఖర్చు
- మారిన గ్రామ రూపురేఖలు
- పథకాల లబ్ధిదారుల హర్షాతిరేకాలు

దెందులూరు: నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన దెందులూరు మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం ఊసేలేదని స్థానికులు అంటున్నారు. విద్యావంతుడు కొఠారు అబ్బయ్యచౌదరి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఐదేళ్లల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం, సహాయ సహకారాలతో దెందులూరు గ్రామ రూపురేఖలు మార్చి వేశారు. విద్య, వైద్యం, పాలనాపరమైన భవనాలు, రైతుభరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లతో పాటు రోడ్లు, డ్రైయిన్లు, ఆర్వో ప్లాంటు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్లకు రుణాలు మంజూరు ఇలా అభివృద్ధి, సంక్షేమాన్ని పెద్ద ఎత్తున చేసి చూపించారు.



దెందులూరు గ్రామ సచివాలయం

గ్రామంలో అభివృద్ధి పనులకు నిధుల ఖర్చు వివరాలు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం దెందులూరులో రోడ్లు, డ్రైయిన్లు, రైతు భరోసా కేంద్రం, సచివాలయం, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి రూ.8.31 కోట్లు ఖర్చు చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ.2.71 కోట్లు ఖర్చు చేశారు. దెందులూరులో మొత్తం డ్వాక్రా 300 గ్రూపులున్నాయి. డ్వాక్రా సంఘాలకు బ్యాంకు రుణాలు రూ.30 కోట్లు మంజూరయ్యాయి. డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరాలో రూ. 5 కోట్లు అందాయి. డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలు రూ. 3 కోట్లు అందించారు. నాడు- నేడు పథకంలో పాఠశాలలకు రూ.2.24 కోట్లు మంజూరు చేశారు. 173 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ పెన్షన్ కానుక 1,682 మందికి రూ.3,78,45,000 అందించారు.



దెందులూరు రైతుభరోసా కేంద్రం

అర్హులందరికీ పథకాలు అందించారు



దెందులూరుతో పాటు నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో ఆదర్శవంతంగా ఎమ్మెల్యే కొఠారు తీర్చిదిద్దారు. నియోజకవర్గానికి ముఖ్య కేంద్రమైన దెందులూరులో ఇంత అభివృద్ధిని, గత టీడీపీ ప్రభుత్వం చేయలేకపోయింది. గ్రామాన్ని అన్ని రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి చేశారు. అర్హులందరికీ పథకాలు అందించారు.

– తలారి రామకృష్ణ, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, పోతునూరు

సకాలంలో సమస్యల పరిష్కారం



అన్ని సమస్యలు సకాలంలో సేవాభావంతో పరిష్కరించారు. నియోజకవర్గంలో ఉద్యోగులు, ప్రజలు, స్వేచ్ఛగా, శాంతియుతంగా జీవించే పరిస్థితులు కల్పించారు. మరింత అభివృద్ధి, సంక్షేమం అమలు కావాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ఇది సాధ్యమవుతుంది. నియోజకవర్గంలో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే కొఠారు చొరవ తీసుకున్నారు.

– గంజి రమణ, న్యాయవాది కొవ్వలి

గ్యాస్ సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

గణపవరం: గ్యాస్ సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారుతుందని, ప్రాథమిక దశలోనే గ్యాస్ సమస్యలను అదుపుచేయాలని ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ చుండూరి మల్లీశ్వరి అన్నారు. ఆదివారం గణపవరం మండల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ రకాల వ్యాధులు, నివారణ, వైద్యసేవలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ఆహారం తీసుకునే విషయంలో సమయ వేళలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పరిమిత ఆహారం, మసాలా, ఫాస్ట్‌ఫుడ్, స్ట్రీట్‌ఫుడ్ వంటి వాటికి దూరంగా ఉండాలని, ఉప్పు, కారం తగ్గించాలని, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు మానుకోవాలని సూచించారు. గ్యాస్ సమస్య ఉన్నవారు తక్షణం వైద్యులను సంప్రదించి, వైద్యం తీసుకుంటే చాలావరకూ తొలిదశలోనే సమస్యను తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు చుండూరి సాయి బాబు మాట్లాడుతూ వివిధరకాల వ్యాధులు, చికిత్సలపై అవగాహన కల్పించారు. మిత్ర మెడికేర్ ఆస్పత్రి వైద్యులు విక్రాంత్, ప్రియాంక , పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నిడమర్తి జయసూర్య, జిల్లా అధ్యక్షుడు ఎఆర్‌కే పరమేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మల్లీశ్వరి

నేడు భైరెడ్డి సిద్ధార్థ రెడ్డి గోపన్నపాలెం రాక

దెందులూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు భైరెడ్డి సిద్ధార్థరెడ్డి సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు దెందులూరు మండలం గోపన్నపాలెంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ హరీష్ యాదవ్ ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అన్ని విభాగాల శ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏనుగు వీరాంజనేయులు, ఎంపీటీసీలు సువ్వా ప్రభుదాసు, ఏనుగు అంజలి ప్రసాద్, పార్టీ నాయకులు వీరంకి సత్యనారాయణ, కొండేటి గంగాధరబాబు, మాగంటి కృష్ణమోహన్, తోట పద్మారావు, మోర్ల సుబ్బారావు, వార్డు మెంబర్లు గోపన్నపాలెంలో ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని గ్రామాల్లో నాయకులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు భైరెడ్డి సిద్ధార్థరెడ్డితో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి(ఫైల్)

పేద విద్యార్థులకు మానవత సాయం

గణపవరం: ఉత్తమ ప్రతిభచూపే పేద విద్యార్థుల చదువుకు మానవత స్వచ్ఛంద సంస్థ అండగా ఉంటుందని మానవత జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు అన్నారు. ఆదివారం గణపవరం మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో మానవత జిల్లా కార్యదర్శి కాకర్ల వినాయకం, మండల కార్యదర్శి శేగు వీరనాగయ్య, నిడమర్రు మండల మానవత శాఖ ఆర్థిక సహకారంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గణపవరం, నిడమర్రు మండలాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 8 మంది విద్యార్థులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఏటా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదోతరగతి చదువున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వినాయక, వీరనాగయ్యను ఇతర సభ్యులను ఆయన అభినందించారు. మానవత సభ్యులు గంటా అన్నవరం, ఆర్‌వీఎస్‌రాజు, విద్యాజ్యోతి నాగేశ్వరరావు, కంతేటి కృష్ణంరాజు, సంకు శ్రీనివాసరావు, ముత్యాల సూరిబాబు, సన్నాల శంకరం, సుబ్బారావు, సీతారామరాజు పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న మానవత సభ్యులు

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

భీమడోలు: వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞాన వంతులు కావాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని వాటిని చదివి వాటి సమీక్షలు రాసారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడులకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో చిన్నారులంతా తమ పరిధిలోని గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞాన సంబంధిత పుస్తకాలను చదివి పఠనాసక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌వీ అమర్‌నాథ్, జి.నాగమణి, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.



భీమడోలులో చిన్నారులకు నీతి కథలను వివరిస్తున్న మండే సుధాకర్

విస్తృత ప్రచారం.. ఉత్సాహంగా పాల్గొన్న జనం

పెదవేగి : దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్టీ శ్రేణులు, గ్రామస్తులు, మహిళలు ఆయనతో పాటు ఉత్సాహంతో అడుగులు వేస్తున్నారు. ఆదివారం పెదవేగి మండలం బి.సింగవరం, కొప్పాకగూడెం, అంకన్నగూడెం, దుగ్గిరాల గ్రామాల్లో ఎమ్మెల్యే కొఠారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 179 జగనన్న, కొఠారు కాలనీలు ఏర్పాటు చేశామని, 25 వేలమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని తెలిపారు. పదేళ్లు ఎమ్మెల్యేగా పని చేసిన చింతమనేని అభివృద్ధి పనులేవీ చేయలేదన్నారు. దుగ్గిరాలలో రూ.29 కోట్లతో అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేశామని తెలిపారు. ఫ్యాను గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని అబ్బయ్యచౌదరి కోరారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

గణపవరం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లారని ఉంగుటూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు అన్నారు.ఆదివారం గణపవరం మండలం వరదరాజపురంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా వాసుబాబును, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ను గెలిపించాలని నాయకులు ఓట్లు అభ్యర్థించారు.



బి సింగవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కొఠారు అబ్బయ్యచౌదరి



ప్రజలకు అభివాదం చేస్తున్న అబ్బయ్యచౌదరి



వరదరాజపురంలో మహిళలకు ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందిస్తున్న వాసుబాబు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, పార్టీ శ్రేణులు

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోతో అన్ని వర్గాలకూ మేలు



వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో భేషుగ్గా ఉంది. ఉద్యోగుల పిల్లలకు విద్యా రుణంపై వడ్డీ ప్రభుత్వం చెల్లించడం, ఆటో డ్రైవర్లుకు, క్యాబ్ డ్రైవర్లకు ఏటా ఇచ్చే రూ.10వేలకు బదులు రూ.20వేలు ఇవ్వడం మంచి పరిణామం, వీరికి ప్రమాద బీమా రూ.7లక్షలు టిప్పరు డ్రైవర్లకు, ప్రైవేటు డెలివరీ బాయ్‌లకు కూడా ప్రయోజనం కలగేలా మేనిఫెస్టో లో పథకాలు రూపొందించారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేలా ఉంది

– అక్కినేని గోపిచంద్ర దుర్గాప్రసాద్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్

ఓసీలకు ఈబీసీ నేస్తం



రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గ ప్రజలందరికీ 5ఏళ్లపాటు ఈబీసీ నేస్తం అందించడం శుభపరిణామం. ఈ పథకాన్ని మరో 5ఏళ్లపాటు కొనసాగిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఓసీ పేద కుటుంబాలకు ఇది ఎంతో ఆసరాగా నిలుస్తుంది. గతంలో ఏ పార్టీ ఓసీలను ఆదరించి వారికి ఉపయోగపడే పథకాలు అందించిన దాఖలాల్లేవు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని మేనిఫెస్టో రూపొందించారు.

– అప్పన కనకదుర్గా ప్రసాద్, వైఎస్సార్ సీపీ పెదపాడు మండల కన్వీనర్

మహిళలకే పట్టం



మహిళలకు ఇళ్ల పట్టాలు, అసైన్డ్ భూములకు పట్టాలు, ఇళ్ల రుణాలు, సొంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు చేయూత గతంలో రూ.75వేలు అందిస్తే ఈసారి ఐదేళ్లలో మరో రూ.75వేలు మంజూరు చేయనున్నారు. అమ్మఒడి రూ.15వేల నుంచి రూ.17వేలకు పెంచి అందించనున్నారు. ప్రజలకు ఎంతో మేలు చేసే పథకాలను మేనిఫెస్టోలో పొందుపర్చడం మంచి పరిణామం. మహిళలకు అన్ని పథకాల్లో భాగస్వాములను చేసి వారికి గుర్తింపునివ్వడంతోపాటు సంఘంలో వారి గౌరవాన్ని పెంచారు. మహిళలు ఎంతో ఎంతో ఆనందంగా ఉన్నారు. మరలా జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

– బత్తుల రత్నకుమారి, పెదపాడు మండల పరిషత్ అధ్యక్షురాలు

గ్రామాల్లో విస్తృత ప్రచారం

పెదవేగి : వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ విజయరాయిలోని ఆ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పెదవేగి మండలం విజయరాయిలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెదవేగిలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సోదరీమణులు వెంకటలక్ష్మి, శ్రీవల్లి గడపగడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరిని, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం విజయరాయిలో చర్చి వద్దకు వెళ్లి ఫాదర్ దివాకర్‌ను కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు.



విజయరాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అబ్బయ్యచౌదరి సోదరీమణులు

వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు కృషి చేయాలి

ఉంగుటూరు: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి ఆయన కైకరం దళితవాడలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రవిప్రకాస్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఉంగుటూరు నియోజకవర్గ అభ్యర్థి పుప్పాల వాసుబాబును, ఎంపీ అభ్యర్థి కారమూరి సునీల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. దళిత సేన ఉంగుటూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చింతల రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దళితసేన కార్యకర్తలు పాల్గొన్నారు. ఉంగుటూరు దళిత సేన మహిళా అధ్యక్షురాలు కోటరాణి, గౌరవ అధ్యక్షురాలు బేతపూడి మణి, సలహా అధ్యక్షురాలు వాసే కుమారి, దళిత సేన మహిళలు పాల్గొన్నారు.



కైకరం దళితపేటలో మాట్లాడుతున్న రవిప్రకాష్

అమలుకు సాధ్యమయ్యే హామీలతో మేనిఫెస్టో

నిడమర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో నవరత్నాల్లో మరిన్ని పథకాలతో మరింత మందికి లబ్ధి చేకూరేలా అమలుకు సాధ్యమయ్యే హామీలే ప్రకటించారని ఎమ్మెల్యే సోదరుడు, పార్టీ మండల బాధ్యుడు పుప్పాల కన్నబాబు అన్నారు. ఆదివారం కన్నబాబు ఆధ్వర్యంలో ఇంటింటి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో కార్యక్రమం నిడమర్రులో నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక భద్రత పింఛన్ల పెంపు, అమ్మఒడి రూ.17వేలకు, జగనన్న తోడు రూ.20 వేలు, రైతుభరోసా రూ.16 వేలకు, డ్వాక్రా రుణాలు రూ.3 లక్షల వరకూ పెంపు వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. చెప్పాడంటే చేసే ముఖ్యమంత్రి జగనన్నకు మరోసారి మీ ఓటు ద్వారా మద్దతు తెలపాలని కన్నబాబాబు ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో జెడ్పీటీసీ కోడే కాశి, సర్పంచ్ పాట్నూరి ఉమామహేశ్వరరావు, ఆర్బీకే మండల చైర్మన్ పోలిశెట్టి రమేష్, పార్టీ అధ్యక్షుడు గుడెసే జాన్‌బాబు, ఎంపీటీసీ దూసనపూడి సత్యనారాయణ, సూతాని ఏసు, పోలిశెట్టి మురళి, టి. వెంకటేష్, బి. పెద్దిరాజు, పతివాడ ఏసు, కన్నాజి సత్యనారాయణ, పెదపాటి రమేష్, పెద్దిరెడ్డి సత్యనారాయణ, వేగిరెడ్డి దొరబాబు, కన్నాజి తేజ, పతివాడ శ్రీను, ఆకుల నాని, బాపిరాజు, పేరిచర్ల రాంబాబు, కిట్టయ్య, వెలిశెట్టి మురళి, టి. శ్రీను, వగ్వాల రాధాకృష్ణ, చలమశెట్టి బాబు తదితరులున్నారు.



నిడమర్రులో వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పుప్పాల కన్నబాబు